ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 9 జనవరి 2024

సదరం క్యాంపునకు
దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ సిటీ, జనవరి 8: వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిలో ఈనెల 18న నిర్వహిస్తున్న సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఆర్‌డీఏ పీడీ ఎం.సంపత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థో, మానసిక విభాగాలకు చెందిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 10న మధ్యాహ్నం 3 గంటల నుంచి మీసేవా కేంద్రంలో స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

మిర్చి రైతుల ఆందోళన


మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ధర్నా
- వ్యాపారుల తీరుపై ఆగ్రహం
- ఏనుమాముల మార్కెట్‌లో రైతుల నిరసన
- పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య


మార్కెట్ గేట్ వద్ద రోడ్డుపై ఆందోళనచేస్తున్న మిర్చి రైతులు

వరంగల్ టౌన్, జనవరి 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం మార్కెట్లో యథావిధిగా మిర్చి జెండా పాట (నాణ్యత గల మిర్చి ధరను నిర్ణయిస్తారు) పాడారు. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. మార్కెట్‌కు వండర్ హాట్, తేజ, యూఎస్-341, దేశీఇలా సుమారు 20 రకాల మిర్చి అమ్మకానికి వస్తాయి. నాణ్యతను బట్టి ఒక్కో రకానికి ఒక్కో ధరను వ్యాపారులు నిర్ణయించి కొనుగోలు చేస్తారు. అయితే సోమవారం తేజ రకానికి క్వింటాకు రూ.20,100 జెండా పాట పాడగా, వ్యాపారులు రూ.17వేలు, రూ.18వేలు, రూ.13వేల చొప్పున ధర నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తక్కువ ధర పలికిన రైతులు గొడవకు దిగారు.

విషయం తెలుసుకున్న మిగతా రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు కూడా ధరలు తగ్గించారని, గత ఏడాదితో పోల్చుకుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగి కొద్ది సేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి సంగయ్య వెంటనే డీఎంవో ప్రసాదరావుకు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్‌పర్సన్ ఇన్‌చార్జి మల్లేశంకు పరిస్థితిని వివరించారు. అలాగే స్థానిక సీఐ మహేందర్.. ఏసీపీ సతీష్‌బాబు, డీసీపీ రవిందర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు మార్కెట్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ఎగుమతి లేక ధరల్లో వ్యత్యాసం
మల్లేశం, మార్కెటింగ్ పర్సన్ ఇన్‌చార్జి

ఎగుమతులు తగ్గడంతోనే గతంతో పోలిస్తే మిర్చి ధరలు తగ్గాయి. ప్రస్తుతం ఇతర దేశాలకు మిర్చి ఎగుమతి తగ్గింది. గతంలో దేశాలకు విరివిగా ఎగుమతు జరగడంతో మన మిర్చికి మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు కూడా పెరిగాయి. వాతావరణంలో మార్పులతో మిరపకాయలో నాణ్యత తగ్గింది.

ఎవరి వాదన వారిదే...

వ్యాపారుల పక్షాన చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డిని, ఆందోళన చేస్తున్న రైతులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్‌రావు, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ చర్చించారు. వ్యాపారులు, రైతులు ఎవరికి వారు తమ వాదన వినిపించారు. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెప్పగా, క్వింటాకు రూ.17వేలు పలికిన మిర్చి, క్వింటా రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు.

మిర్చిలో నాణ్యత ఉంటే ఒక ఖరీదుదారు కాకపోతే మరో ఖరీదుదారుడికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని, లేదా మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని అప్పటి వరకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకోవచ్చని వ్యాపారులు తమ వాదన వినిపించారు. అధికారులు ఇరువర్గాలకు నచ్చచెప్పారు. తక్కువ ధర పలికిందనిపిస్తే ఆ రైతుల వద్దకు మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు, పోలీసులు వచ్చి పరిశీలించి నాణ్యతకు అనుగుణంగా ధర పెట్టేందుకు మరో ఖరీదుదారుడిచే కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

నాణ్యతను బట్టే ధరలు
బొమ్మినేని రవిందర్ రెడ్డి, చాంబర్ అధ్యక్షుడు

నాణ్యతను బట్టే ధరలు ఉంటాయి. మిర్చి నాణ్యతతో ఉన్నప్పుడు రైతుకు ఖరీదు దారుడు చెప్పిన ధర నచ్చకపోతే మరో ఖరీదు దారుడు పోటీ పడి అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తాడు.

వందల మంది కొనుగోలు దారులున్నారు. కాంపిటేషన్ బిజినెస్ ఇది. వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించారనడం సరైంది కాదు. ధర నచ్చకపోతే కోల్డ్ స్టోరేజీలో ఎట్టుకుని రైతుకు నచ్చిన ధర పలికినప్పుడే అమ్ముకోవచ్చు.

నాణ్యతను గుర్తించడం లేదు : తిరుపతి రెడ్డి రైతు

మార్కెట్లో వ్యాపారులు ఎవరికి ఇష్టం వచ్చిన ధర వారు నిర్ణయిస్తున్నారు. జెండా పాట రూ.20 వేలు చెప్పి కొనుగోలు చేసేది మాత్రం రూ.16వేలు, రూ.17 వేలకే అంటే ఎట్లా. మీరెంతకు కొంటే అంత ధరను చెప్పాలి. అంతే తప్పా చెప్పేదానికి కొనేదానికి పొంతన లేకుండా ఉంటే రైతులు నష్టపోతారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఇక ముందు అలా జరగకుండా చూసుకోవాలి.

మూతపడిన సి.డాట్ సెంటర్

- మూడేళ్లుగా పనిచేయని మిర్చి గ్రేడింగ్ ల్యాబ్
- సిబ్బంది కొరతతో తెరుచుకోని వైనం
- రైతులకు అవగాహన కల్పించని అధికారులు




కంప్యూటర్‌లో మిర్చి నాణ్యతను వీక్షిస్తున్న టెక్నికల్ సిబ్బంది(ఫైల్)

వరంగల్‌టౌన్, జనవరి 8: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి నాణ్యతను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సి.డాట్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కంప్యూటింగ్) గ్రేడింగ్ ల్యాబరేటరీని సమస్యలు చుట్టుముడుతున్నాయి. మూడేళ్ల క్రితమే దీన్ని ఏర్పాటు చేయగా, వివిధ కారణాలతో ప్రారంభానికే ఏడాది పట్టింది. తెలంగాణలో పండించే మిర్చికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. విదేశాలకు నాణ్యతమైన మిర్చినే ఎగుమతి చేయాల్సి ఉంటుంది. అందుకోసం కేంద్రం మార్కెట్లో సి.డాట్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఈ ల్యాబరేటరీలో మిర్చిని సంబంధిత యంత్రంపై వేసి కంప్యూటర్ ద్వారా దాని నాణ్యతను గుర్తిస్తారు. రంగు, గింజ శాతం, నాణ్యతకు సంబంధించిన వివరాలన్నీ కంప్యూటర్‌లో నమోదవుతాయి. స్కాన్ తర్వాత రిసిప్ట్ కూడా ఇస్తారు. దీంతో రైతు అమ్మకానికి తీసుకువచ్చిన మిర్చి ఏ మేరకు నాణ్యత ఉంది.. ఎంత ధర పెట్టవచ్చు అన్నది తెలుస్తుంది. మార్కెట్‌కు మిర్చి అమ్మకానికి తీసుకువచ్చిన రైతులు ముందుగా ల్యాబరేటరీలో పరీక్షలు చేశాక, గిట్టుబాటు ధర పలికినప్పుడే సరుకును అమ్ముకునేందుకు అవకాశం కూడా ఉంది. ల్యాబరేటరీని అందుబాటులోకి తెస్తే ల్యాబ్ రిపోర్టును బట్టి విక్రయాలు జరుపుకుంటామని రైతులు పేర్కొంటున్నారు. రిపోర్టును బట్టి గిట్టుబాటు అవుతుందా లేదా అన్నది తెలిసిపోతుదని పేర్కొంటున్నారు. అధికారులు రోజు ఉదయం రైతులకు తెలిసేలా మైక్‌లో చెప్పించా లని కోరుతున్నారు.

సిబ్బంది కొరత

సిబ్బంది కొరతతో మార్కెట్లో గ్రేడింగ్ ల్యాబరేటరీ మూలనపడింది. అసలు ఇది ఉన్నది అన్న సంగతి కూడా రైతులకు తెలియదు. ల్యాబరేటరీలో నిష్ణాతులైన టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. లేదా మార్కెట్ కమిటీలో పని చేస్తున్న వారికి తర్ఫీదైనా ఇవ్వాలి. అయితే మార్కెట్ కమిటీలో మొత్తం 109 మంది ఉద్యోగులకు కేవలం 38 మందే పనిచేస్తున్నారు. సిబ్బంది కొరతతో గ్రేడింగ్ ల్యాబరేటరీకి ప్రత్యేకించి ఉద్యోగుల కేటాయించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ల్యాబరేటరీలో టెస్టింగ్‌లు చేయడం లేదు.

పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు గిట్టుబాటు ధరలు పొందడంలో విఫమవుతున్నారు. మార్కెట్లో ల్యాబరేటరీని ఏర్పాటు చేసినా, దీనిపై మిర్చి రైతులకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. దీంతో రైతులు ఖరీదుదారులు ఎంత చెబితే అంత ధరకు అమ్ముకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

అవగాహన కల్పించాలి..

మిర్చి గ్రేడింగ్ ల్యాబరేటరీలో తర్ఫీదు పొందిన టెక్నిక ల్ సిబ్బందిని వెంటనే నియమించాలని రైతులు కోరుతు న్నారు. ఉదయం మిర్చి యార్డులో రైతులు తెలుసుకునే విధంగా మైక్‌లో చెప్పాలని వారు కోరుతున్నారు. తమ సరుకును గ్రేడింగ్ చేయించుకుంటే సరుకు నాణ్యతకు తగ్గ ధర పలికిందా.. లేదా అన్నది నిర్ధారణ చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని రైతు సంఘాలు నాయకు లు పేర్కొంటున్నారు. టెస్టింగ్, గ్రేడింగ్ ల్యాబరేటరీని మూసి వేయడం వెనుక అసలు కారణం వ్యాపారులేనని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు చొరువ తీసుకుని ల్యాబ్‌ను 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- గ్రీవెన్స్‌లో 66 దరఖాస్తులు


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 8: ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 66 దరఖాస్తులు రాగా, ఇందులో గ్రేటర్ వరంగల్ మునిసిపల్‌కు చెందినవి 8, భూ సంబంధిత సమస్యలు 13, రెవెన్యూ 7, డీఆర్‌డీవో 3, సివిల్ సప్లై ఒకటి, జిల్లా పంచాయతీ అధికారి ఒకటి, మిగతావి ఇతర సమస్యలకు సంబంధించినవి దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి పంపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డీవో వాసు చంద్ర, నర్సంపేట ఆర్‌డీవో కృష్ణవేణి, డీఆర్‌డీవో సంపత్‌రావు వివిధ అధికారులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' బిల్లులు చెల్లించాలి

గీసుగొండ, సంగెం మండలాలతోపాటు నగరంలోని మూడు డివిజన్ల పరిధిలో 1,395 మంది లబ్ధిదారులు గృహలక్ష్మి పథకం కింద గృహ నిర్మాణ పనులు ప్రారంభించుకున్నారని, వారికి వెంటనే బిల్లులను మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జడ్పీటీసీ సభ్యులు పోలీసు ధర్మారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారులుగా గీసుగొండ మండలంలో 445, సంగెం మండలంలో 610, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15 డివిజన్‌లో 115, 16వ డివిజన్‌లో 106, 17వ డివిజన్‌లో 119 మొత్తం 1,395 మందిని ప్రభుత్వం లబ్ధిదారులుగా ఎంపిక చేసి మంజూరి చేయడం జరిగిందన్నారు. కొత్త ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో లబ్ధిదారులు దిక్కు తోచని పరిస్థితిలో పడిపోయా రన్నారు.

ఉద్యమకారులకు స్థలం, పింఛన్ అందజేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ హామీల్లో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ ఇస్తామని ప్రకటించారని ఆ పథకాలు అందజేసి ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్లి రవి అన్నారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గొలనుకొండ ఉపేంద్ర, ముష్కె ప్రమీలదేవి, డి.సుధాకర్, బొమ్మగాని కుమారస్వామి, శంకేసి లింగ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్
వేగవంతం చేయాలి
కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 8: ప్రజా పాలన సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎల్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కస్టం మిల్లింగ్ రైస్ సీఎంఆర్ వానాకాలం యాసంగిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మిల్లర్లు వారికి కేటాయించిన రోజు వారి లక్ష్యాలను మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం డెయిలీ టార్గెట్ పూర్తి చేయుటకు కలెక్టర్లు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సివిల్‌సప్లై డీఎం చందన్‌కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆపరేటర్లు నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు. గడువులోగా కంప్యూటరీకరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారి రామిరెడ్డి, జిల్లా పంచాయతీ శాఖాధికారి కల్పన పాల్గొన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములివ్వం'


కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం అందిస్తున్న భూనిర్వాసిత రైతులు

దామెర, జనవరి 8: వ్యవసాయమే జీవన ఆధారంగా జీవిస్తున్న రైతులు తమ పచ్చని పంట పొలాలను గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని స్పష్టం చేశారు. తాము చావనైనా చస్తామని.. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఎంతో విలువైన పంట భూములను ఇచ్చేదే లేదని బాధిత భూ నిర్వాసిత రైతులు హెచ్చరించారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం బాధిత రైతులు తమ వినతి పత్రం అందించారు.

అనంతరం బాధిత భూనిర్వాసిత రైతులు బూర్గుల రాంచందర్‌రావు, బొల్లు సమ్మిరెడ్డి, బొల్లు రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా తాము వ్యవసాయంతోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని స్పష్టం చేశారు. ఒక్కో పంట కాలంలో రెండు నుంచి మూడు పంటలు పండించుకునే పచ్చని పొలాలను రోడ్ల నిర్మాణాలకు వదులుకోబోమని తెలిపారు. అయితే గ్రీన్‌ఫీల్డ్ హైవేను.. బ్రౌన్‌ఫీల్డ్ హైవేగా మార్చాలని, లేదంటే పూర్తి రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో పచ్చని పంట పొలాలను రోడ్ల నిర్మాణాలకు వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు.

పంట పొలాల నుంచి రోడ్ల నిర్మాణం చేసుకుంటూ పోతే.. ఇక రాబోవు భవిష్యత్ తరాలకు ఆహార పదార్థాల కొరత తథ్యమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బాధిత భూ నిర్వాసిత రైతులు ఎరుకల రమేష్, మంద సంధ్యారాణి, నల్లెల్ల సతీష్‌కుమార్, అబ్బాడి రవీందర్‌రెడ్డి, బొమ్మకంటి రాజకొమురయ్య, దేవేందర్, అయిలు సాంబయ్య, భిక్షపతి ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుచేసే వారికే ఓటేస్తాం
ఆర్‌ఎంయూ డివిజనల్ సెక్రటరీ శంకర్‌రావు


శిబిరంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

వరంగల్, జనవరి 8 : పాత పెన్షన్ విధానం అమలుచేసే రాజకీయ పార్టీలకే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రైల్వే కార్మికులు ఓట్లు వేస్తారని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ శంకర్‌రావు అన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, రైల్వే మజ్దూర్ యూనియన్ వరంగల్ శాఖ అధ్యక్షుడు ముకుందం ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. శంకర్‌రావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ రవిందర్, చైర్మన్ ముకుందం, నాయకులు భాస్కర్, సుధాకర్, బాబురావు ,అహ్మద్, భిక్షపతి, రమేష్, బాలాజీ, వర్మ, రాజేష్, సంగీత పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం
ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గట్టు ప్రసాద్


ఐక్యత చాటుకున్న టీడీపీ నేతలు

వర్ధన్నపేట, జనవరి 8 : ప్రజా సమస్యలపై పోరాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, 'కుడా' మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్ అన్నారు. సోమవారం వర్ధన్నపేటలోని భారతీ థియేటర్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియా సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కావడంతో ఇచ్చిన హామీల అమలు, పరిపాలన తీరుపై కొంత సమయం ఇచ్చి స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో ఇచ్చిన హామీల అమలులో, పరిపాలన విషయంలో లోపాలు జరిగితే ప్రజల తరపున నిలబడి పోరాడాల్సిన బాధ్యత టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందనన్నారు. ప్రతీ టీడీపీ కార్యకర్త గ్రామ, బూత్ స్థాయిలో ఉండి పార్టీ కోసం పనిచేస్తూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జిఎల్.శ్రీధర్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగవెల్లి సురేశ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎలుగు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, భూపాలపల్లి కోఆర్డినేటర్ ముక్కిరాల జనార్దన్‌రావు, పరకాల నియోజకవర్గ బాధ్యులు కం దుకూరి నరేశ్, వెలగందుల రవీందర్ గుప్తా, తాటి కాయల అనిల్, మాదాసి సమ్మయ్య, సంద్ర మల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కోసం 4, జీడబ్ల్యూఎంసీ 6, ఎస్సీ కార్పొరేషన్ 2, ఆర్డీవో 5, ఎంజీఎం 1, తహసీల్దార్ 11, ఎంపీడీవో 3, ఉపాధి కార్యాలయం 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 8 : ఈనెల 10 నుంచి 14 వరకు కర్ణాటకలోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను కేయూ నుంచి ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.సువర్ణ, బి.భాగ్యశ్రీ, బి.మాధవి, (యూసీపీఈ, కేయూ) ఎస్. శివ రాణి,(యూసీఈటీ, కేయూ) ఎస్.నందిని, (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్, ఖమ్మం), బి.రమ్య,(యూసీపీఈ, కేయూ), ఎం.కరీన, (టీటీడబ్ల్యూఆర్డీసీ(వుమెన్స్),ఆసీఫాబాద్), కె.రమ్య (వీసీపీఈ, బొల్లికుంట), బి. రేహజు, (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్, ఖమ్మం), కె.సింధూజ, (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్ ఉట్నూర్), ఎం.రచన, (యూసీపీఈ, కేయూ), సీహెచ్. మౌనిక (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్ ,ఉట్నూర్), టి.స్నేహ, (వీసీపీఈ, బొల్లికుంట), సీహెచ్.శివాని (టీటీడబ్ల్యూఆర్డీసీ, వుమెన్స్, మంచిర్యాల) ఇ.వెన్నెల (టీటీడబ్ల్యూఆర్డీసీ (వుమెన్స్), కొత్తగూడెం),వి.రిషిత, (టీటీడబ్ల్యూఆర్డీసీ(వుమెన్స్), మంచిర్యాల)లు ఎంపికైయారు. వీరికి కొత్తగూడెం సింగరేణి వుమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

క్యాంపు కార్యాలయంలో నాయిని పూజలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల నిర్వహణలో నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమారెడ్డితో పాటు సీపీ అంబర్ కిషోర్ ఝూ

హనుమకొండ సిటీ, జనవరి 8 : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన సతీమణి నీలిమారెడ్డి, అల్లుడు విష్ణువర్దన్‌రెడ్డి, కూతురు గోదారెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, ఏసీపీ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవీయస్ శ్రీనివాసాచార్యులు, ఈవీ శ్రీనివాస్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు విజయకుమారాచార్యులు, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

కాజీపేట, జనవరి 8 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఎంప్లాయీస్ సంఘ్ నాలుగు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ దీక్షలను ప్రారంభించారు. అనంతరం సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి జూదం ఆడుతుందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించి తీరుతామన్నారు. ఈ దీక్షలను స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ నర్సింగరావు, ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, వర్కింగ్ చైర్మన్ నారాయణ, కె. రవి, వరప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏకాంబరం, బల్వీందర్ సింగ్, అజీజ్ పాషతోపాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ

రైల్వేలను ప్రధానిమోదీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని నిలిపివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీపీఎం నేత ఎం. చుక్కయ్య, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చుక్కయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా రైల్వే కార్మికు లపై పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కొండ శ్రీనివాస్, ఎస్‌కే.అఫ్జల్ పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ ఆల్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ నాయిని సదానందం, దాడబోయిన శ్రీనివాస్ యాదవ్, సంగ రమేశ్, ఈ. రాజేందర్, కె. బాల మురళీ రాజ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టీ- ఎమ్మార్పీఎస్‌కు పలువురి రాజీనామా

వడ్డెపల్లి, జనవరి 8: తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల వెంకట్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తి కోర్నెల్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాముల రమేష్ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలి

హనుమకొండ రూరల్, జనవరి 8: పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఇక నుంచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ వారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, రాధ, సునీత, విజయ్ కుమార్, రామ్‌కిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) తిరుపతిరెడ్డి



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ రూరల్, జనవరి 8: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) వంటేరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని దీవ్య భవన్‌లో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వంటేరు తిరుపతిరెడ్డి, విశిష్ట అతిథులుగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అకౌంట్స్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. సమష్టి కృషితోనే ఏదైనా సాధించే సత్తా మనందరిలో ఉందని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ విషయంలో ప్రభుత్వానికి నివేదించి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

అనంతరం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వేణుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్ కుమార్, బి.వసంత్‌రావు, ఎస్.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుదర్శన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.మురళి, చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.లక్ష్మణ్, రేష్మ, ఫైనాన్స్ సెక్రటరీగా బి.దేవేందర్, మహిళా కార్యదర్శిగా ఎం.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎ.నాగరాజు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, ఎస్ఏఓలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది

రాజేందర్‌రెడ్డి-ఝూన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్

గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ

పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు

తొర్రూరు రూరల్, జనవరి 8 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝూన్సీరెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చుతో నిర్మిస్తున్న హనుమాండ్ల లక్ష్మమ్మ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని విప్ రాంచంద్రునాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొంగల చేతిలో పడి లూటీ అయిందన్నారు. అలాంటి దొంగలను ప్రజలు తరిమికొట్టి మార్పు కోరుకుంటూ విద్యావంతులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే 40 ఏళ్లుగా సేవ చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝూన్సీరెడ్డిలు సేవాతత్పరులని, ఈ ప్రాంతం వారు కావడం అదృష్టమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయగల సమర్థులని, ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అనేకంగా ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని కోరారు.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేసి శాంతియుత పాలనకు స్వాగతం పలికిన ప్రజలను కాపాడుకోవడానికి ఝూన్సీ రుద్రమ్మవలే ముందుకు వచ్చారన్నారు. యువతలో నైపుణ్యం వెలికితీస్తేనే స్వయం శక్తులుగా ఎదుగుతారని, అందుకోసం పాటుపడుతున్న రాజేందర్‌రెడ్డి-ఝూన్సీరెడ్డి దంపతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోపిడీకి పాల్పడారని, వారంతా ఐపీసీ 390 పరిధిలోకి వచ్చే వాళ్లన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దోపిడీ దారులకు అడ్డుకట్ట వేసి, బడుగుల అభివృద్ధి కోసం విద్యావంతులను అసెంబ్లీకి తీసుకెళ్లిన కాంగ్రెస్ పేదల పక్షపాతి అన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తన అత్తామామలు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝూన్సీరెడ్డి స్ఫూర్తితో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసినప్పుడే అభివృద్ధి చెందుతారని, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి లభిస్తే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందన్నారు. వాళ్లు పడ్డ కష్టాలు ఎవ్వరూ పడవద్దనే ఉద్దేశ్యంతోనే యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్లంబింగ్, బ్యూటీషియన్, చేనేత తదితర పనులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కోడలిని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం కోసం, పాలకుర్తిని అభివృద్ధి చేయడానికి శక్తినంతా ధారపోస్తానని అన్నారు. ఈ గెలుపు తమది కాదని, ప్రజల గెలుపేనని అన్నారు.

ఒకే వేదికపై ఐదుగురు ఎమ్మెల్యేలు

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల శంకుస్థాపనకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెలే డాక్టర్ మురళీనాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆతిథ్యం ఇచ్చారు.

నేడు పట్టుకున్న వాహనాల వేలం

హనుమకొండ క్రైం, జనవరి 8: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలలో పట్టుకున్న రెండు వాహనాలను మంగళవారం ఉదయం సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని 50 శాతం దరావత్ సొమ్మును చెల్లించిన తర్వాత పాటలో పాల్గొనాలని రామకృష్ణ తెలిపారు.

మేడారంలో ముమ్మరంగా పనులు



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న దృశ్యం



స్నాన ఘట్టాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మేడారం, జనవరి, 8 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఆయా పనులు చేపడుతున్నారు. జాతర తొలిరోజు కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలకు సారలమ్మ జంపన్న వాగు మీదుగా చేరుకోనున్న నేపథ్యంలో పలు పనులకు శ్రీకారం చుట్టారు. వాగులోని లోతట్టు ప్రదేశంలో టిప్పర్ల సహాయంతో ఇసుకను పోస్తూ మరమ్మతులు చేస్తున్నారు. అలాగే జాతరలో భక్తుల కోసం స్నాన ఘట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. స్నానాల కోసం బ్యాటరీ ట్యాప్స్, మహిళలు బట్టలు మార్చుకునే గదులు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశారు. సంక్రాంతి పండుగ లోపు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం నీటిపారుదల చేపడుతున్న పనులను ఐటీడీఏ పీవో అంకిత్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని డీఈ సదయ్యకు సూచించారు. అనంతరం ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్, ఆదివాసీ మ్యూజియం సుందరీకరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వోఎం రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. జనవరి 9న మంగళవారం వెంకయ్య నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కేయూలో శ్రీనివాసరావు దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రభుత్వ పాలన శాస్త్రం, హెచ్ఆర్ఎం విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

నేరస్థులకు శిక్షపడే కేసులు నమోదు చేయాలి

మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు

ఐనవోలు, జనవరి 8: నేరస్థులు తప్పుచేసి తప్పించుకోకుండా శిక్షపడే కేసులనే నమోదు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాధవత్ రాజు డిమాండ్ చేశారు. ఒంటిమామిడిపల్లిలో డిసెంబరు 25న మంత్రాల నెపంతో గోనె సోమలక్ష్మి(65) అనే వృద్ధురాలిని హత్యచేశారు. ఈ సంఘటనపై మానవహక్కుల వేదిక బృందం నిజనిర్ధారణ కోసం ఒంటిమామిడిపల్లి గ్రామంలో బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సోమలక్ష్మి దగ్గరి బంధువైన గోనె పెద్దరాజు కుమారుడు గోనె మధు డిసెంబరు 17న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు మృతుడి తల్లిదండ్రులు దేవుడు చెప్పేవారి వద్దకు వెళ్లి అడిగించుకున్నారని తెలిపారు. దేవుడు చెప్పేవారు మీ సమీప బంధువు (చేతబడి) మంత్రాలు చేయడం వల్లే మీ కుమారుడు చనిపోయాడని చెప్పడంతో రాజు కుటుంబసభ్యులు సోమలక్ష్మిని హత్యచేశారని తెలిపారు. పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించినప్పటికీ మూఢ నమ్మకాలను నమ్మి హత్య చేశారని వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిపారు. కేవలం హత్యచేశారని కేసు నమోదు చేయడంతో సరైన సాక్షాధారాలు ప్రత్యక్ష సాక్షులు లేరని కేసు నీరుగారి నిందితులు బయటకు వస్తారన్నారు. పోలీసులు కేవలం హత్యకేసు కాకుండా సంఘటనా స్థలంలో లభించే వాస్తవ ఆధారాలతో హత్య చేశారని కేసు నమోదు చేస్తే నిందితులకు శిక్ష పడుతుందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా




కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్


హనుమకొండ అర్బన్, జనవరి 8 : ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరిం టెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్ టీయూసీ) ఎంజీఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ గద్దెల ప్రేమలత అధ్యక్షతన సోమవారం నూతన సంవత్సర సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంజీఎం సూపరింటెం డెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మా ట్లాడారు. ఎంజీఎం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ప్రేమలత, ఎంజీ ఎం బ్రాంచ్ ఫార్మసీ సూపర్‌వైజర్ ఎంకి పద్మావతి, సునీత, రాజ్యలక్ష్మీ, ప్రీతి, సజని, సుప్రియ, సరళారాణి, సల్మా, శ్యామల, సృజన, ఉదయకృష్ణ, రమాదేవి, భిక్షపతి, ఉమాదేవి, జమున, సుచరిత, అనురాధ తదిత రులు పాల్గొన్నారు.

కేయూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రావణ్



ప్రశాంత్



శ్రావణ్

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్షుడిగా కొక్కుల ప్రశాంత్, కార్యదర్శిగా బొండ్ల శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబీవీపీ వరంగల్ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబులు హాజరై కేయూ కమిటీ వివరాలను ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్, అశోక్, నవీన్, చరణ్, రాజు, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీస్‌గా రాజు, అజయ్, రఘు, సాయి, ప్రకాశ్, యశ్వంత్, శివ తదితరులు ఎంపికైయారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, పెండ్ల అమర్, గట్టు ప్రశాంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.


ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

హనుమకొండ రూరల్, జనవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ఈ నెల 11వ తేదీలోపు చివరి అవకాశంగా అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని డీఈవో అబ్దుల్ హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు www.telanganaopenschool.org ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 80084 03631, 93963 37572 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రవి



తాళ్ళపెల్లి ప్రకాశ్



దుర్గం రవి

ఖిలావరంగల్, జనవరి 8: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్ళపెల్లి ప్రకాశ్, ఉపాధ్యక్షుడుగా దుర్గం రవిలు ఎన్నికయ్యారని టీజీఏ రాష్ట్ర సంఘం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి వెంకట విమాదిత్య ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికలలో ప్రకాశ్, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వీరు రెండేళ్లపాటు కమిటీలో కొనసాగుతారన్నారు.

కేయూ హాస్టల్స్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ నేతల డిమాండ్

కేయూ క్యాంపస్, జనవరి 8: కేయూ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నాణ్యతలేని పాలు, పెరుగు, కిరాణ సామాన్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ అధికారులు తమకు అనుకూ లమైన వారికి కాంట్రాక్టర్లు ఇప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నాసిరకం ఆహార పదా ర్థాలు సరఫరాతో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు హతిరాం, జిల్లా కమిటీ సభ్యుడు స్టాలిన్, జస్వంత్, రోహిత్, బీఎస్ఎఫ్ నాయకులు మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం

వర్ధన్నపేట, జనవరి 8 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం రేపింది. సోమవారం రోజు వారీగా విధులకు హాజరైన సిబ్బందికి కార్యాలయంలో పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే వారికి విషయం చెప్పడంతో, వారు అక్కడకు చేరుకొని పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం పామును నిర్మానుష్య ప్రదేశంలో వదిలి వేయడంతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



పామును పట్టుకుంటున్న దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన ట్రెయినీ ఐపీఎస్



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న శుభంనాగ్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 8: శిక్షణ నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన నూతన ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్ సోమవారం కలెక్టర్ పి.ప్రావీణ్యను ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

ఎనిమిది మంది బైండోవర్



బైండోవర్ అయిన బెల్ట్‌షాపుల నిర్వాహకులు

వరంగల్ సిటీ, జనవరి 8: ఖిలావరంగల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 8 మందిని ఐనవోలు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఐనవోలు కొమురవెల్లి మల్లన్న జాతర సజావుగా సాగేందుకు మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడా బెల్ట్ షాపులు నిర్వహించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఇందులో భాగంగా వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 8 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. నాగపురం గ్రామానికి చెందిన బుర్ర సతీష్, తోట రాజేష్, పున్నేల్‌కు చెందిన మూర కుమారస్వామి, ఐనవోలుకు చెందిన బొల్లెపెల్లి శ్రీధర్, బొల్లెపెల్లి రమేష్, బొల్లెపెల్లి రాజశేఖర్, బొల్లెపెల్లి సుభద్ర, గడ్డం ఎల్లాగౌడ్ తదితరులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నిరంతర గస్తీ నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎ. సరిత, కానిస్టేబుళ్లు రాజు, చిరంజీవి తదితులు పాల్గొన్నారు.

నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గీసుగొండ, జనవరి 8: మండలంలోని వంచనగిరి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో నైట్ వాచ్‌ఉమెన్ పోస్టుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. గీసుగొండ మండలపరిధిలో స్థానికులరాలై ఉండి, టెన్త్ పాసై, 45 సంవత్సరాల లోపు గల మహిళలు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, ఫొటో జతచేసి ఈ నెల 11 లోపు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రార్ చాంబర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల బైఠాయింపు

కేయూక్యాంపస్, జనవరి 8: 2010 బ్యాచ్‌కు చెందిన కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు న్యాయం చేయాలని సోమవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన చేపట్టారు. వర్సిటీలో పనిచేస్తున్న కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు తమకు వ్యతిరేకంగా కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. తమకు వ్యతిరేకంగా వేసిన కేసులో యూనివర్సిటీ ఈ నెల 12న తమకు అనుకూలంగా కౌంటర్ దాఖలు చేయాలని రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందచేశారు. 130వ ఈసీ నిర్ణయం మేరకు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రిజిస్ట్రార్ శ్రీనివాసరావు స్పందిస్తూ తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ శాస్త్రీ, డాక్టర్ పొడేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేయూ అడిట్ విభాగం ఏఆర్‌గా రాము..?

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎల్.రామును నియమించినట్టు సమాచారం. సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ నెల 5న శనివారం ఏసీబీ దాడుల్లో అడిట్ విభాగం ఏఆర్‌గా పనిచేసిన ఎస్.కిష్టయ్య పట్టుబడిన విషయం విదితమే. అ స్థానంలో కేయూ యూజీ పరీక్షల విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధుల్లో ఉన్న రామును అడిట్ విభాగానికి బదిలీ చేస్తూనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రాము అడిట్ విభాగంలో ఏఆర్‌గా జాయిన్ కావడానికి సంశయిస్తున్నట్లు తెలుస్తోంది.

వైన్స్ షాపుల ఇష్టారాజ్యం

- కానరాని స్టాక్ బోర్డులు
- బెల్టు షాపులకు అధిక ధరలకు విక్రయం
- భారీగా వసూలు చేస్తున్న బెల్టు షాపు నిర్వాహకులు

సంగెం, జనవరి 8: మద్యం షాపుల నిర్వాహకులు తగిన నిబంధనలు పాటించడం లేదంటూ మద్యంప్రియులు మండిపడుతున్నారు. బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా 60 వరకు మద్యం షాపులుండగా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో క్వార్టర్‌కు రూ.10 నుంచి రూ.30 వరకు బెల్టు షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్టు షాపులకు తరలుతున్న మద్యంను వైన్స్ షాపుల యాజమానులు ఒక్కో బాటిల్‌కు రూ.15 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. అయినా అబ్కారీశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తుగా షాపుల కోసం టెండర్లు పిలిచిన కాంగ్రెస్ నేతలు అప్పటి ప్రభుత్వం పలు ఆరోపణలు చేశారు. మద్యం అమ్మకాలను గ్రామాల్లో సాగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రామాల్లో బెల్టుషాపులను రద్దు చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తోందని, బెల్ట్ షాపులపై కొరడా ఝుళిపించాలని మహిళలు కోరుతున్నారు.

షాపుల వద్ద బోర్డులు కరువు

నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల(హనుమకొండ) పరిధిలో సుమారు 58 మద్యంషాపులు నడుస్తున్నాయి. షాపులను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని సూచించినా యాజమానులు వాటిని తుంగలో తొక్కుతున్నారు. గెజిట్‌లో పేర్కొన్న షాపు పేరుతోపాటు షాపులో స్టాక్ బోర్డు, ధరల పట్టికను ప్రదర్శించాలన్న నిబంధనలు ఎక్కడా కానరావడం లేదు. మద్యం విక్రయాలు సాగే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకోవాలన్న నిబంధనలు పాటించడం లేదు. ప్రధానంగా ప్రధాన రహదారి పక్కన షాపులకు అనుమతి ఇచ్చే ముందు అధికారులు గదులను పరిశీలన చేసి షాపు నిర్వహించే ప్రాంతంలో బడులు, గుడులతోపాటు ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాల్సి ఉంటుంది. షాపునకు ఆనుకుని నడుస్తున్న తినుబండారాల షాపులో ధరలకు రెక్కలు వస్తున్నాయి. తాము పెట్టిందే తినాలి. మేము చెప్పిన ధరలకు మద్యం ప్రియులు కొనుగోలు చేయాలి అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు.



సంగెంలోని ఓ వైన్‌షాపు వద్ద కానరాని స్టాక్ బోర్డు

ఎన్ఎంఏ కార్యదర్శికి సన్మానం



డాక్టర్ మైదం రాజును సన్మానిస్తున్న డాక్టర్ పులి అనిల్‌కుమార్

ఖిలావరంగల్, జనవరి 8: ఇటీవల వరంగల్‌లో జరిగిన నేషనల్ మెడికల్ అసోసియేషన్(ఎన్ఎంఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ మైదం రాజును సోమవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, డాక్టర్ పులి అనిల్‌కుమార్ బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన డాక్టర్ రాజు ఇటీవల జరిగిన ఎన్ఎంఏ ఎన్నికలలో ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పులి అనిల్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ మైదం రాజు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులలో రాణించాలన్నారు. ప్రస్తుతం ఆయన వరంగల్ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భగా డాక్టర్ రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన డాక్టర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రెండ్స్ పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు ఎల్. భాస్కర్



ప్రధాన కార్యదర్శి సిద్దోజు శ్రీనివాస్

మట్టెవాడ, జనవరి 8: వరంగల్ ఫ్రెండ్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ 16వ వార్షికోత్సవం సోమవారం వరంగల్‌లో జరిగింది. ఈ సమావేశంలో 16వ వార్షిక నివేదికను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఫ్రెండ్స్ పరపతి సంఘం అధ్యక్షుడు ఎల్. భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్దోజు శ్రీనివాస్ సంఘం ప్రగతి నివేదికను, ఆర్థిక అభివృద్ధి సంబంధిత అంశాలను వివరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫ్రెండ్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా లకుం భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా సిద్దోజు శ్రీనివాస్, కోశాధికారిగా మామిడాల శ్యాంసుందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సభ్యులు రజినీకాంత్, రమేష్, రాజేందర్, అర్జున్, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో వాసంతి

వరంగల్ సిటీ, జనవరి 8: తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌తో పాటు డైరీని డీఈవో డి. వాసంతి ఆవిష్కరించారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో వాసంతి చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, సీనియర్ నాయకుడు మైన శ్రీనివాస్, నాయకులు జి. వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, యు. అశోక్, ఎం. వెంకట్, జి. రాజేష్, జి. వెంకటేశ్వర్‌రావు, భీమళ్ల సారయ్య, ఉమేష్, చక్రునాయక్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని డీఈవో కార్యాలయంలో డీఈవో వాసంతి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సోమశేఖర్, కుమార్, సుజన్ ప్రసాద్, దామోదర్, రవూఫ్, టి.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, లింగమూర్తి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత గ్రామాల కోసం కృషి చేయాలి

వరంగల్‌టౌన్, జనవరి 8: ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో మై చాయిస్ ఫౌండేషన్ సహకారంతో రూపొందించిన సురక్షితగ్రామాల బుక్‌లెట్‌ను మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, సీఐ మహేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ.. సురక్షిత గ్రామాలను తీర్చిదిద్దడంతో గ్రామంలోని అన్ని వర్గాల వారు కృషి చేయాలన్నారు. గ్రామంలో గృహహింస, మహిళలు, ఆడ పిల్లలపై లైంగిక హింస, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడకుండా నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



సురక్షిత గ్రామాల బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ సతీష్‌బాబు

యువత విద్య, క్రీడారంగాల్లో రాణించాలి



క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేస్తున్న నిర్వాహకులు

ఖిలావరంగల్, జనవరి 8: క్రీడల ద్వారా యువకులలో క్రీడానైపుణ్యంతో పాటు శరీర దృఢత్వం, ఆత్మధైర్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్‌రాజ్ అన్నారు. సోమవారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను మెరుగు అశోక్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడారంగాలలో రాణించాలన్నారు. అనంతరం ఆయనను బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ 35వ, డివిజన్ అధ్యక్షుడు రేణికుంట్ల శివకుమార్, స్థానిక పెద్దలు గడ్డం రవి, అంకం సత్యం, బేర కిషన్, నాగుల రవిసాగర్, లడ్డు, ఎర్ర సాయిరామ్, సుంచు శ్రవణ్, సతీష్, ఎం. అనిల్, బి. అవినాష్, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

నెక్కొండ, జనవరి 8 : రైల్వే ఉద్యోగి సందబోయిన నాగరాజు (50) నెక్కొండ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం వరంగల్ రైల్వే పోలీసులు తెలిపారు. నాగరాజు నెక్కొండ రైల్వే స్టేషన్‌లో గత కొంతకాలంగా పాయింట్స్‌మెన్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. ఇటీవలనే వ్యక్తిగత కారణాలతో విధులకు సెలవు పెట్టాడు. ఆదిలాబాద్-తిరుపతి కృష్ణ ఎక్స్‌ప్రెస్ కిందపడి నాగరాజు ఆత్మహత్యకు పాల్పడగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. శవ పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టంనకు తరలించారు. నెక్కొండలోని రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్న నాగరాజుకి భార్య నర్మద, ఇద్దరు కుతుర్లు మనిషా, శీరిషా, కుమారుడు యశ్వంత్ ఉన్నారు.

రేపు కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం

హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

భీమదేవరపల్లి, జనవరి 8 : భక్తుల కొంగు బంగారమైన కొత్తకొండ ఈరన్న జాతరకు శ్రీవీరభద్రస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ సంవత్సరం సమ్మక్క-సారలమ్మ జాతర ఉంటుంది. సమ్మక్క-సారలమ్మను దర్శించుకునే ముందు వీరభద్రస్వామిని దర్శించుకోవడం భక్తులకు ఆనవాయితీ. దీంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలను సమర్పిస్తూ స్వామి వారి కృపకు భక్తులు పాత్రులవుతారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించేందుకు గత నెల రోజులుగా అధికారులు పనులు మొదలు పెట్టారు. భక్తులకు ఎక్కడ లోటుపాట్లు కలుగకుండా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈవో కిషన్‌రావు ప్రతి పనిని దగ్గరుండి పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికారులందరి సమిష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన శ్రీవీరభద్రస్వామి కల్యాణం ఈ నెల 10న సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు సమర్పిస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు కీర్తన



కీర్తనను అభినందిస్తున్న ఎమ్మెల్యే దొంతి

దుగ్గొండి, జనవరి 8 : మండలం లోని మల్లం పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో 8వ తరగతి చదువుచున్న కీర్తన సాఫ్ట్‌బాల్ జాతీయ ఛాంపియన్ షిప్ క్రీడలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన అండర్ 17 విభాగం గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో కీర్తన పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం భద్రమ్మ, పీఈటీ వీరగొని స్వప్న సోమవారం వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కీర్తన అభినందించారు. కీర్తన ప్రయాణ చార్జీలకు ఇన్నర్ క్లబ్ విజేత వరంగల్ అధ్యక్షుడు విజయగోపాల్, అరుణ, లలితలు రూ:4000లు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చుక్క రమేశ్, ఎస్ఎంసీ ఛైర్మన్ జగదీశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అమూల్య

పర్వతగిరి, జనవరి 8: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని కొంకపాక గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మేక అమూల్య ఎంపికైనట్లు హెచ్ఎం అల్లం దాసు భిక్షపతి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగాంజిల్లాలోని ధర్మకంచెలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరగగా అండర్-14 విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అమూల్యతో పాటు శిక్షణ నిచ్చిన పీఈటీ రవీనాను సర్పంచ్ వర్కాల రమేష్ ఉప సర్పంచ్ రంగు రంజిత్‌కుమార్, ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్ రావు, ఉపాధ్యాయులు విశ్వనాథశర్మ, వెంకట్రాంనర్సయ్య, కుమారస్వామి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు అభినందించారు.

క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేత



శంభునిపేట క్రికెట్ టీమ్ స్పాన్సర్ యూసఫ్‌ను సత్కరిస్తున్న క్రీడాకారులు

శంభునిపేట, జనవరి 8 :క్రీడాకారులను ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో రాణిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు యూసఫ్ (టబ్బు) అన్నారు. కాకతీయ ప్రీమియర్ లీగ్ (కేపీఎల్)లో పాల్గొనే శంభునిపేట క్రికెట్ టీమ్‌కు ఆయన క్రీడా సామాగ్రిని అందించారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌కు కావాల్సిన క్రికెట్ కిట్స్‌తో పాటు పలు ఉపకరణాలను ఇచ్చారు. ఈ సందర్భంగా శంభునిపేట యూనిక్యూ చాలెంజర్స్ టీమ్ సభ్యులు సోమవారం శంభునిపేటలో ఏర్పాటు చేసిన అభినందన సభలో యూసఫ్‌ను ఘనంగా సత్కరించారు.

పోటీలో రాణించి కప్‌ను సాధిస్తామని టీమ్ సభ్యులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, అమీర్, అఫ్తాబ్, రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలపై అవగాహన కలిగి ఉండాలి



యువతకు అవగాహన కలిపిస్తున్న ఎస్సై భరత్

సంగెం, జనవరి 8 :యువత ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కలిగి ఉండాలని సంగెం ఎస్సై భరత్ అన్నారు. సోమవారం ఎల్గూరు స్టేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రమేష్‌నాయక్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువతీ, యువకులు విద్యతో పాటు ఉద్యోగాలు పొందేందుకు కృషిచేయాలన్నారు. యువత కష్టపడి ఉన్నత రంగాల్లో రానించేందుకు చదవుకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు.చదువుకున్న వారంతా ఉపాధి అవాకాశాలను ఎర్పరచుకోవాలని చెప్పారు. స్కిల్‌డెవలప్‌మెంట్‌పై తగిన శిక్షనను పొందాలని ఆయన సూచించారు.

అయ్యప్ప శరణుగోషతో మార్మోగిన గవిచర్ల

సంగెం,జనవరి8: 41 రోజుల కఠినమైన దీక్షలో ఉన్న అయ్యప్ప మాల ధరించిన స్వాములకు గురుస్వామి ఇరుముడి కట్టారు. సోమవారం మండలంలోని గవిచర్లలోని శ్రీరామలింగేశ్వరాలయంలో గ్రామానికి చెందిన కొంతం గురుస్వామి అయ్యప్ప మాలలు ధరించిన 18 మందికి ఇరుముడి కట్టారు. ఆయలంలో ప్రత్యే పూజలు చేసిన అనంతరం మాలలు ధరించిన వారు అయ్యప్ప శరణుగోసలు చెబుతుండంగా మొదటగా కన్నెస్వాములకు ఇరుముడి కట్టారు. ఒకే వేదికలో 18 మందికి అయ్యప్ప ఇరుముడి కడుతుండటంతో గ్రామంలోని అయ్యప్ప మాలాలు దరించిన వారి కుటుంబ సభ్యులతో పాటు అయ్యప్ప భక్తులు తరలివచ్చి అయ్యప్ప ఇరుముడి ఎత్తుకున్న వారి ఆశీర్వాదం పొందారు.



ఇరుముడి కట్టుకున్న అయ్యప్పస్వాములు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 9 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

నర్సంపేట టౌన్, జనవరి 8 : నర్సంపేట పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం డీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆ సంఘం నాయ కులు ఆవిష్కరించారు.డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కూనమల్ల కొమ్మాలు, మండల మానిటరింగ్ అధికారి కొర్ర సారయ్యలు మాట్లాడుతూ డీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలు ఉపాధ్యాయులకు దిక్సూచిగా పనిచేస్తాయని, విద్యాపరంగా వివిధ విషయాలను డైరీల్లో పొందపర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షు డు ఎస్.కె. సర్దార్, కార్యదర్శి పూజారి రవి, చందర్, వెంకటే శ్వర్లు, నాగేశ్వర్, సంతోష్ క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులుపాల్గొన్నారు.

గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుచేయాలి

• నెక్కొండ మండల సభలో తీర్మానం



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్

నెక్కొండ, జనవరి 8 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయాలనికోరుతూ నెక్కొండ మండల సభల్లో ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. సోమవారం ఎంపీపీ జాటోతు రమేశ్ అధ్యక్షతనఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీటీసీలు సంగని సూరయ్య, కర్పూరపు శ్రీనివాస్, అపర్ణ తదిరులు సంక్షమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టాలకు గురయే ప్రమాదం ఉందంటూ ఈ విషయమై తాము ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ఆమోదించాలంటూ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ద్వార సరఫరా చేస్తున్న తాగునీరు మండలంలోని పలు గ్రామాల్లో సరిగా అందడంలేదని సభలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తెలిపారు. ఇప్పుడే తాగునీటి కొరత ఉంటే ఎండకాలంలో పరిస్థితి ఏమిటంటూ వారు ప్రశ్నించా రు. కొన్ని గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌ల నుంచి నీరులీక్ అవుతుండంతో నీరు వృథా అవుతుందని సంబంధితాధికారులు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ట్యాంక్‌లను మరమ్మతుచేయించాలని అధికారులు సూచించారు. 50శాతం సబ్సిడీలపై మండలంలోని వివిధ గ్రామాలోని రైతులకు 180 విద్యుత్ మోటార్లు, 18వేల మీటర్ల పైపు లైన్ సరఫరా చేశామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ కాలువల ద్వార సాగునీరు అందండంలేదని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారనగా, ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉండటంతో నీటి కొరత ఏర్పడుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రైతులు ఆరుతడిపంటలనే సాగుచేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ లావుడ్యా సరోజనహరికిషన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ జానకిదేవి, వెలుగు ఎంపీఎం శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో జాకోబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం

వర్ధన్నపేట, జనవరి 8: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాము కలకలం రేపింది. సోమవారం రోజు వారీగా విధులకు హాజరైన సిబ్బందికి కార్యాలయంలో పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే వారికి విషయంచెప్పడంతో, వారు వెంటనే అక్కడకు చేరుకొని పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం పామును నిర్మానుష్య ప్రదేశంలో వదిలి వేయడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

పది విద్యార్థులు ఉన్నత ఆశయ సాధనగా చదవాలి

చెన్నారావుపేట, జనవరి 8: పది విద్యార్థులు ఉన్నత ఆశయ సాధన దిశగా చదివాలని రోటరీ క్లబ్ రాష్ట్ర గవర్నర్ బుషిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు పదిలో జీపీఏ 10/10ను సాధించే విధంగా పట్టుదలతో చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గడియారాన్ని బహుమతిగా అందిస్తామన్నారు. అనంతరం పది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మేటియరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఇరుకు కోటేశ్వర్‌రావు. నర్సంపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాదం రంజిత్ కుమార్, మాజీ అధ్యక్షుడు గుడిపూడి పవన్‌కుమార్, కంది గోపాల్‌రెడ్డి, గోపు జయపాల్ రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవిందర్‌రెడ్డి, హెచ్ఎం పాపమ్మ, మోతే ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 8 : సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీ కొట్టిన సంఘటన మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇల్లందకు చెందిన సాతుపెల్లి ఎల్లయ్య వర్ధన్నపేటలో సైకిల్‌పై కూరగాయాలు అమ్మి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇల్లంద శివారులో ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొట్టి తప్పించుకున్నాడు. ఈ ఘటనలో ఎల్లయ్యకు తలకు, కాలికి గాయం కాగా , వెంటనే అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలో ఢీకొట్టిన బైక్ నంబర్ ప్లేట్ లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు.

నిధులే లేవు.. జీవోలు తెచ్చారు..

• ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పెద్ది యత్నం
• విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట టౌన్, జనవరి 8: ఐదేళ్లలో చేయలేని పనులను నెలలో చేస్తానంటూ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు నిధులులేని జీవోలను తీసుకొచ్చిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు కర్రుగాల్చివాత పెట్టారని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉనికి చాటుకోవడానికి బూటకపు మాటలు మాట్లాడితే మరో మారు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. నర్సంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ ఏజెన్సీ వాళ్లు స్వచ్ఛందంగా పేద మహిళలకు కుట్టుమిషన్లు బహూకరిస్తున్న సమయంలో, తానే ఇస్తున్నట్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉనికిచాటుకొని గత ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వ్యూహ రచన చేసినప్పటికీ ప్రజలు నమ్మలే దన్నారు. ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వ కుండా అంతర్గతంగా దరఖాస్తు తీసుకొని దళితబంధు ఇస్తామంటూ ఒక్కొక్క యూనిట్‌కు ఐదుగురు పంచుకోవాలంటూ అగ్రిమెంట్లు రాయించి మోసం చేసి నేడు దళిత బంధు మంజూరైందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఒక్క పేద కుటుంబానికి ఇల్లు, వంద గజాల ఖాళీ స్థలం ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో నిధులు లేని జీవోలను తీసుకొచ్చి నేడు అభివృద్ధి పనులను గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకివచ్చి నెల రోజులే ఐనప్పటికీ ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. అభయహస్తం దరఖాస్తులతో అర్హులైన ప్రజలందరికి రాజకీయాలకతీతంగా ఆరు గ్యారంటీలను అందిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, రంజిత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాంబయ్య గౌడ్, గోపాల్‌నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తాం

ఖానాపురం: పాకాల ఆయకట్టులో యాసంగిలో చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పాకాల ఆయకట్టులో యాసంగి సాగు కోసం పాకాల సాగు నీటిని సోమవారం ఎమ్మెల్యే విడుదలచేశాడు. పాకాల కట్టమైసమ్మ, హనుమాన్‌గుడి వద్ద, తూముల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తూముల నుంచి నీరు లీకేజీతో వృథాగా పోతున్నా, మరమ్మతులు చేపట్టలేదని అన్నారు. రాబోయే ఖరీఫ్ నాటికి తూములకు మరమ్మతులు చేపట్టి లీకేజీ నీటిని అరికడుతామన్నారు.

20ఎంసీ సామర్థ్యంతో రంగాయ చెరువు, ఎర్రయ చెరువుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల నిర్మాణం కోసం 2008సంవత్సరంలో రూ.330కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఐనప్పటికి 2009లో టెండర్లు పూర్తయినప్పటికీ మంజూరీని రద్దుచేశారన్నారు. అప్పడు మంజూరీ చేసిన నిధులతోనే రామప్ప నుంచి పాకాలకు పైపులైన్ల నిర్మాణం చేపట్టి పాకాలకు గోదావరి జలాలను మళ్లించారని పేర్కొన్నారు. గోదావరి నుంచి భీంఘన్‌పూర్ అక్కడినుంచి రామప్ప మీదుగా పాకాలకు పైపులైన్ల ద్వార గోదావరి జలాలు రావాల్సి ఉందన్నారు. భవిష్యత్‌తో వరదనీటిని ఒడిసి పట్టి గ్రావిటీ ద్వార పాకాలకు అదనపు జలాలు అం దించేందుకు రామప్ప-పాకాల ప్రాజెక్ట్‌కు ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాకాల కాలువలపై లష్కర్ల నియామకం చేపట్ట నున్నట్లు తెలిపారు. పాకాలను పర్యటక కేంద్రంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, జిల్లా నాయకులు పరుచూరి రత్నాకర్‌రావు, కర్నాటి పార్వతమ్మ, వేములపల్లి వెంకటప్రసాదరావు, మారబోయిన రాములు, బొబ్బ విద్యాసాగర్‌రావు, పల్నాటి శ్రీను, వీరమనేని సాగర్‌రావు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి



నర్సంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

నర్సంపేట, జనవరి 8: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తహసీల్దార్‌కార్యాలయం ఎదుట మండలంలోని పలు గ్రామాల గృహలక్ష్మి లబ్ధిదారులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం రద్దు వల్ల అనేక మంది లబ్ధిదారులు రోడ్డున పడాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చి ఆదుకోవాలని లేదా గృహలక్ష్మి పథకాన్ని అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం రద్దు వల్ల మండలంలో సుమారు 350 మంది గత ప్రభుత్వం నుంచి ప్రొసీడింగ్ పత్రాలు అందుకుని ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు నష్టపోతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గృహలక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చి గృహలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుమ్మ నాగయ్య, సోమర్తి రాజు, దాసరి బుచ్చిరెడ్డి, మేకల సమ్మయ్య, పెరుమాండ్ల కట్టస్వామి, తుమ్మ వెంకటేటేశ్, పెండ్యాల భారతక్కతో పాటు మహిళలు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్‌ను పొందిన మండల గృహలక్ష్మి లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ బొనగాని రాజేష్‌కు వినతి పత్రంను అందజేశారు. అనంతరం గృహలక్ష్మీ లబ్ధిదారులు మాట్లాడుతూ.. మండలంలో గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ను పొందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో భట్టు సాంబయ్య, గుగులోతు సుశీల, అజ్మీర విజయ, తేజావత్ భారతి, గుగులోతు కాంత, మేకల స్వప్న, జెట్టి సారిక తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : గృహలక్ష్మి లబ్ధిదారులకు న్యాయంచేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సుమనవాణికి వేరు వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గృహలక్ష్మీ లబ్ధిదారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 350మంది నిరుపేద కుటుంబాలకు గృహలక్ష్మి పథకం కింద గత సెప్టెంబరు నెలలో ప్రొసీడింగ్ పత్రాలు అందించడంతో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల తరువాత ఇంటి బిల్లులు చెల్లిస్తామని అధికారులు నేటివరకు ఎలాంటి బిల్లులు చెల్లించలేదని, ప్రసుత్తం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో గృహలక్ష్మి ఇండ్ల జీవోను రద్దు చేసినట్లు ప్రకటించడంతో తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల స్థానంలో తమకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని అధికారులను వేడుకున్నారు. కార్యక్రమంలో గృహలక్ష్మీ లబ్ధిదారులు శైలజా, అరుణ, స్వప్న, సుమలత, సాగర్, కృష్ణ పాల్గొన్నారు.

• దుగ్గొండి: గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం రద్దు చేయడం సరియైనది కాదని ఆపథకం ద్వారా గృహలు మంజూరి కావడం జరిగిందని సోమవారం వివిధ గ్రామాల లబ్ధిదారులు తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. గృహలు మంజూరీ కావడంతో ఇండ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతీ లబ్ధిదారుడికి రూ.5 లక్షలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మంపేట, చంద్రయ్యపల్లి, ఎజీతండా, మందపల్లి తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఉన్నారు.

• చెన్నారావుపేట: మండలంలోని గృహ లక్ష్మీ పథకం కింద గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ అయిన ప్రతీ లబ్ధిదారునికి బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు పర్యవేక్షణ చేసి దరఖాస్తులు చేసుకున్న వారందరికీ గృహలక్ష్మి పథకం ఇండ్ల బిల్లులు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులు పలు డిమాండ్‌లో కూడిన వినతి పత్రాన్ని అందిచారు. ఈ కార్యక్రమంలో బొల్లపెల్లి లక్ష్మీ, బోడ కల్పన, భూక్య శాంతమ్మ, తాల్లపెల్లి అనిత, భూక్య అనూష, కుమా'ర్, బాషబోయిన పూలమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికి శ్రీరాముడి అక్షింతల వితరణ

నల్లబెల్లి, జనవరి 8 : మండలంలోని రుద్రగూడెం గ్రామంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతలను ఇంటింటికి భక్తులు సోమవారం అందించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటిని శుభ్రంచేసుకొని, ఇంటిలో దీపాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి కవితావిజేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గందె శ్రీలతాశ్రీనివాస్ గుప్తా, మామిండ్ల రాజిరెడ్డి, అనుముల ముత్తారెడ్డి, మంద రాజిరెడ్డి, మంద లింగారెడ్డి, బేతి కర్ణాకర్, మంద మోహన్, పాండవుల నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : అయోధ్య శ్రీరామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని అన్నారంషరీఫ్ గ్రామానికి వచ్చిన అయోధ్య రాములవారి అక్షింతలను సోమవారం గ్రామంలో పలువురికి ట్రస్టు గ్రామ బాధ్యులు అందించారు. ట్రస్టు గ్రామ సంయోజక్ చేబెల్లి మహేందర్‌యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో సహ సంయోజక్ గొల్లపెల్లి సంతోష్, పూజారి రామగిరి దామోదరాచార్యులు, రామసేవకులు గొల్లపెల్లి అనీల్, చెలుకలపెల్లి జంపయ్య, రత్నాకర్, సంతోష్, రాకేష్, సందీప్ పాల్గొన్నారు.

• నెక్కొండ : శ్రీఅయోధ్య రామనంద తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షింతలను అంగరంగ వైభవంగా శోభాయాత్ర అక్షింతల వితరణ కార్యక్రమాన్ని నెక్కొండలో సోమవారం నిర్వహించారు. అక్షింతలను పల్లకిలో ఉంచిన భక్తులు శ్రీ అంజనేయస్వామి దేవాలయం నుండి శోభాయాత్రను ప్రారంభించిన బొడ్రాయి (గ్రామ దేవత) వద్ద పూజలను నిర్వహించి అనంతరం శ్రీరామలింగేశ్వరస్వామియం వరకు తీసుకెళ్లారు. అక్షింతల పల్లకికి భక్తులు మంగళహారతిలతో స్వాగతం పల్లికారు. శోభాయాత్ర ముగిసిన అనంతరం నెక్కొండలో ఇంటింటికి అక్షింతలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పభక్తులు కూడా పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీరామభక్తులు గడ్డం సురయ్య సతీష్, కొంకాల సతీష్, కెక్కెర్ల నాగయ్య, అంబాల రాంగోపాల్, శ్రీరంగం శ్రీనివాస్, సుమంగళి కుమార్, శాడ సరితారెడ్డి, కేదారినాథ్ అభియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రగూడెంలో ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలను పంపిణి చేస్తున్న భక్తులు

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఫలితాలను సాధించాలి

నెక్కొండ, జనవరి 8 : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను విద్యాశాఖ కల్పిస్తుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి ప్రభుత్వ లక్ష్యానికి చేరుకోవాలని రాష్ట్ర గురుకులాల సలహాదారుడు గడ్డం రమేశ్ కోరారు. సోమవారం మండలంలోని పెద్దకొర్పోలు కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హాస్టల్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా, అర్హత కల్గిన ఉపాధ్యాయులు విద్యా బోధనలు చేస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్‌టీఎస్ అధ్యక్షుడు తడుగుల జనార్ధన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వర్ధన్నపేట రూరల్, జనవరి 8 : మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన కంజర్ల భాస్కర్ తల్లి అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ కన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ పస్తం రాజు, ఉపసర్పంచ్ కళింగరావు, రాజు, సంకినేని వెంకట్, రమేష్, రవి తదితరులు ఉన్నారు.

సాఫ్ట్ బాల్ క్రీడలలో జాతీయ స్థాయికి ఎంపికైన కీర్తన



కీర్తనను అభినందిస్తున్న ఎమ్మెల్యే దొంతి

దుగ్గొండి, జనవరి 8 : మండలంలోని మల్లం పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుచున్న కీర్తన సాఫ్ట్‌బాల్ జాతీయ ఛాంపియన్ షిప్ క్రీడలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన అండర్ 17 విభాగం గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో కీర్తన పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం భద్రమ్మ, పీఈటీ వీరగొని స్వప్న సోమవారం వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 15 వరకు రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కీర్తన అభినందించారు. కీర్తన ప్రయాణ చార్జీలకు ఇన్నర్ క్లబ్ విజేత వరంగల్ అధ్యక్షుడు విజయగోపాల్, అరుణ, లలితలు రూ:4000లు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చుక్క రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ జగదీశ్వర్, ఉపాధ్యాయులు రఘునాథం, దేవేందర్, సురేశ్ తదితరులు అభినందించారు.

పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

చెన్నారావుపేట, జనవరి 8: మండల కేంద్రంలో పీఆర్‌టీయూటీఎస్ వారి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవి ష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈదు నూరి రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించటంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ముందుందన్నారు. ఉపాధ్యాయులు నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాపమ్మ, సురేందర్‌గౌడ్, గుండేటి మహేందర్, రాష్ట్ర కార్యదర్శి ఇంద్ర కర్ణాకర్ రెడ్డి, రవి, అంజనేయులు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, జ్యోతి, మాదురి, లింగారెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కర్షక ప్రభుత్వం

• ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



మైలారంలో రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, జనవరి 8 : తెలంగాణ రాష్ట్రంలోని కర్షకులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న రిజర్వాయర్‌లోని నీటిని రబీ పంటల సాగు కోసం కెనాల్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సారెస్పీ అధికారులతో రిజర్వాయర్ సామర్థ్యం, నీటి పంపింగ్ విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువ ద్వారా చెరువుల్లోకి నీరు వెళ్లడమే కాకుండాపంట పొలాల మధ్య నుంచి వెళ్లడం వలన భూగర్భ జలాలు పెరిగి రైతులకు మంచి లాభాలు చేకూరుతాయన్నారు. రైతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నాడని తెలిపారు. రైతు భరోసా లాంటి కార్యక్రమం తీసుకువచ్చి రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ రమేష్ బాబు, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ బాలదాసు, జేఈ నందకిషోర్, సర్పంచ్ సుమతి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అమూల్య



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి, జనవరి 8: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని కొంకపాక గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మేక అమూల్య ఎంపికైనట్లు హెచ్ఎం అల్లందాసు భిక్షపతి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగాంజిల్లాలోని దర్మకంచెలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరగగా అండర్-14 విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అమూల్యతో పాటు శిక్షణ నిచ్చిన పీఈటీ రవీనాను సర్పంచ్ వర్కాల రమేష్, ఉప సర్పంచ్ రంగు రంజిత్‌కుమార్, ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్ రావు, ఉపాధ్యాయులు విశ్వనాధశర్మ, వెంకట్రాంనర్సయ్య, కుమారస్వామి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, సతీష్‌కుమార్, లలిత అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు



వరదరాజేశ్వర్‌రావుతో పదో డివిజన్ నాయకులు

వర్ధన్నపేట, జనవరి 8 : కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వర్ధన్నపేట పట్టణంలోని 10వ డివిజన్ నాయకులు కలిసి కట్టుగా ఏకతాటిపైకి వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఐఎన్‌టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావును కలిశారు. ఈ కార్యక్రమంలో పదవ డివిజన్ నాయకులు తుమ్మల సోమనాథం, తుమ్మల నరసింహ స్వామి జన్ను నవీన్, తుమ్మల కొమురయ్య, తుమ్మల కుమార స్వామి, రడపాక యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి పరామర్శ

నర్సంపేట టౌన్, జనవరి 8 : నర్సంపేట పట్టణానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ బల్సుకూరి కృష్ణమాదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో డివిజన్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు ఆయన కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సంద ర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణ మృతి ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్‌కు తీరని లోటని సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గట్ల అమరేందర్, దుర్గస్వామి, బాలచందర్, సంతోష్, సోమేశ్వర్, నరేష్, కన్నయ్య. రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, జనవరి 8 : మండలంలోని చలపర్తి గ్రామంలో ఇటీవల ఉల్లేరావు సూరయ్య మృతి చెందగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో రూ:27,332లు మృతుడి కుటుంబానికి సోమవారం అందించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లయాదవరెడ్డి, ఉప సర్పంచ్ కొటగిరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శంకేశి మహేందర్, వార్డు సభ్యురాలు శ్రీవాణి మహేందర్, కోల రవీందర్, గన్న శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం

చెన్నారావుపేట, జనవరి 8 : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునీలను సోమవారం పాఠశాలల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఇదే పాఠశాలలో పని చేసిన సబిత, మంజుల, సంధ్య, అనిత, నాగరాణి, మౌనిక, స్వరూపలు బదిలీపై వెళ్లారు. ఉపాధ్యాయునీలను సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

నెక్కొండ, జనవరి 8 : రైల్వే ఉద్యోగి సందబోయిన నాగరాజు (50) నెక్కొండ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం వరంగల్ రైల్వే పోలీసులు తెలిపారు. నాగరాజు నెక్కొండ రైల్వే స్టేషన్‌లో గత కొంతకాలంగా పాయింట్స్‌మెన్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. ఇటీవలనే వ్యక్తిగత కారణాలతో విధులకు సెలవు పెట్టాడు. ఆదిలాబాద్-తిరుపతి కృష్ణ ఎక్స్‌ప్రెస్ కిందపడి నాగరాజు ఆత్మహత్యకు పాల్పడగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. శవ పంచనామా జరిపి శవాన్ని పోస్టుమార్టంనకు తరలించారు. నెక్కొండలోని రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్న మృతుడికి బార్య నర్మద, ఇద్దరు కుతుర్లు మనిషా, శీరిషా, కుమారుడు యశ్వంత్ ఉన్నారు.